క్లుప్తంగా

పెంచిన ధరలపై సంతకాల సేకరణ



తెర్లాంలో సీపీఎం ఆధ్వర్యంలో జరుగుతున్న సంతకాల సేకరణ

తెర్లాం: మండల కేంద్రమైన తెర్లాంలో సీపీఎం ఆధ్వర్యంలో గురువారం కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పెరిగిన ధరలకు నిరసనగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోపాలం మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత, మోదీ ప్రధానమంత్రి అయినప్పటి నుంచి దేశంలో నిత్యావసర సరుకుల ధరలు, గ్యాస్, పెట్రోల్ ధరలు ఎక్కువగా పెరిగిపోయాయన్నారు. పెరిగిన ధర కారణంగా సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా బీజేపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పనుల పరిశీలన



కోనంగిపాడులో డ్రైనేజీ నాణ్యత తనిఖీ చేస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

వంగర: మండలంలోని వంగర, కోనంగిపాడు, కింజంగి ఆర్అండ్ఆర్ కాలనీల్లో చేపట్టిన సీసీ డ్రైనేజీ పనులను విజయనగరం క్వాలిటీ కంట్రోల్ అధికారులు గురువారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లో రూ.20 లక్షలతో నిర్మాణం చేపట్టిన డ్రైనేజీల నాణ్యత తనిఖీ చేశారు. కార్యక్రమంలో విజయనగరం గ్రామీణ నీటి సరఫరా విభాగం క్వాలిటీ కంట్రోల్ డీఈఈ పి.ప్రభాకర్, రాజాం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కె.రాజేష్, వంగర మండల ఏఈ అక్కలపోతు సూర్యనారాయణ, జేఈ కె.చైతన్య, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

వంగర: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయాలని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శుక్రవారం నుంచి పెన్షన్ల బట్వాడా చేయడంతో పాటు చేయూత సర్వే వేగవంతంగా చేపట్టాలన్నారు. గ్రామాల్లో స్పందన ద్వారా వచ్చిన వినతులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ వై.దుర్గారావు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ



కాగితాపల్లిలో సంతకాల సేకరణలో సీపీఎం నాయకులు

రేగిడి: ప్రజా సమస్యలు పరిష్కారానికి సీపీఎం పోరాటం చేస్తోందని ఆ పార్టీ నాయకులు పోరెడ్డి విశ్వనాథం, ఎం. త్రినాథ్, కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని కాగితాపల్లిలో గురువారం నిర్వహించిన సమరభేరి కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి సంతకాలు సేకరించారు. ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సెప్టెంబర్ 1, 3, 4న పలుచోట్ల నిర్వహించనున్న వివిధ పోరాట కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

స్నేహపూర్వకంగా మెలగాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు.

రాజాం సిటీ: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే స్నేహపూర్వకంగా మెలగాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ, న్యాయవాదులు సీహెచ్ శ్యాంప్రసాద్, హెచ్ఎం బి.మాధురి పాల్గొన్నారు.

అర్హులైతే చాలు... సంక్షేమ ఫలాలు

- సిఫార్సులతో పని లేదు
- జగనన్న పాలనలో పారదర్శకత
- ఎమ్మెల్యే శంబంగి



ముగడలో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేందుకు అర్హత ఉంటే చాలని ఎటువంటి సిఫార్సులతో పని లేదని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని ముగడ గ్రామంలో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అవినీతికి తావు లేకుండా డీబీటీ విధానంతో నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే సంక్షేమ పథకాల నగదు జమ చేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. ముగడకు దశాబ్దాలుగా తీరని సాగునీటి సమస్య తీర్చామన్నారు. ఈ గ్రామంలో పార్టీలకతీతంగా రూ.కోట్లు లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ద్వారా అందుతున్నాయన్నారు. గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా తెచ్చిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే పాలన అందిస్తున్నామన్నారు. ప్రజల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తుందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. దీన్ని ప్రజలు గుర్తించి మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డికే పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో ఆయనతో పాటు బొబ్బిలి మండల పార్టీ అధ్యక్షుడు శంబంగి వేణుగోపాల నాయుడు, మున్సిపల్ చైర్మన్ ఎస్‌వీ. మురళీకృష్ణ, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు, ఆ గ్రామ పార్టీ నాయకులు యామల శివప్రసాద్, మత్స సూర్యనారాయణ, తీళ్ల నాగభూషణరావు, మత్స శంకరరావు, పలువురు నాయకులు, అభిమానులు వివిధ గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యదర్శి సుగుణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నను ఆశీర్వదించండి..



గడప గడపకు.. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కంబాల జోగులు, తదితరులు

- ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి: కుల మతాలు, పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండల పరిధిలోని కాకరాపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. అంతకుముందు గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే ఒక్కో కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాభివృద్ధే ధ్యేయంగా ప్రతి సచివాలయానికీ ముఖ్యమంత్రి రూ. 20 లక్షల చొప్పున మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో గ్రామంలో ఏవైనా సమస్యలుంటే పరిష్కరించుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని మేనిఫెస్టోలో చేర్చి 98 శాతం అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందని చెప్పారు. ఇంతవరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమని చెప్పారు. 2024లో జరగనున్న ఎన్నికల్లో జగనన్నను మరోసారి గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు సిరిపురపు జగన్‌మోహనరావు, ఎంపీపీ సిరిపురపు మంజు, సర్పంచ్ వావిలపల్లి ధనలక్ష్మి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ జి.స్వామినాయుడు, స్థానిక నాయకులు వావిలపల్లి రమణ, వైస్ సర్పంచ్ కోడి కృష్ణవేణి, ఎంపీడీఓ రవికుమార్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే అజెండా..



సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

- ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రాజాం: అన్ని ప్రాంతాల అభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ అజెండా అని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. పట్టణంలోని డోలపేటలో రూ. 7 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పనులను గురువారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 15వ ఆర్థిక సంఘ నిధులతో ఈ రోడ్డు నిర్మిస్తున్నట్లు చెప్పారు. పార్టీలకతీతంగా అన్నివర్గాల వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు సమానంగా నిధులు కేటాయించి, సీఎం జగన్ మోహన్ రెడ్డి అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. రాజాం పట్టణంలోని అన్నివార్డుల్లో మౌలిక వసతులు కల్పించారని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాజాం పట్టణ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, నేతలు గోకవలస బాబూరావు, పాలవలస గోపి, పాలవలస ధవళేశ్వరరావు, దూబ గోపాలం, తోట తిరుమలరావు, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, ఏఈలు పి. వెంకట్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

సక్రమంగా జగనన్న గోరుముద్ద

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని సక్రమంగా భోజన నిర్వాహకులు అమలు చేయాలని, మెనూ అమలులో ఎటువంటి తేడాలు ఉన్నా చర్యలు తప్పవని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. మండలంలోని గొలుగువలస ప్రాథమిక పాఠశాలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరును, పాఠశాల రికార్డులను, విద్యార్థుల వర్కు బుక్స్‌ను, ఉపాధ్యాయుల లెసన్ ప్లానింగ్‌లను తనిఖీ చేశారు. పాఠశాలలో గల మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించి, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని స్కావెంజర్‌కి సూచించారు. అనంతరం జగనన్న గోరుముద్ద పథకాన్ని తనిఖీ చేసి విద్యార్థులకు వండుతున్న వంటల వివరాలు, ఈ రోజు మెనూ ఏమిటని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

అందుబాటులో పురుగు మందులు

రేగిడి: రైతుభరోసా కేంద్రాల వద్ద కియోస్కో మిషన్ ద్వారా రైతులకు సరసమైన ధరలకు వ్యవసాయ పురుగుమందులు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయశాఖ అధికారి గురుగుబెల్లి మురళీకృష్ణ తెలిపారు. చాటాయివలస ఆర్‌బీకేలో కియోస్కో మెషీన్ ద్వారా పురుగు మందులు కొనుగోలుపై గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం గోవిందరావు, ఎంపీటీసీ సభ్యుడు పాగిరి అప్పలనాయుడు, వీఏఏ కెంబూరు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వినతి..

రాజాం: నియోజకవర్గానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కంబాల జోగులుకు వినతిపత్రం అందజేశారు. జీతాలు పెంచడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ రామ్మూర్తినాయుడు, బి.ఉమాకుమారి, విజయకుమారి, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

గాజుల అలంకరణలో పైడితల్లి



విజయనగరం టౌన్: స్థానిక రైల్వేస్టేషన్ వద్ద నున్న వనంగుడిలో కొలువైన పైడితల్లి అమ్మవారిని శ్రావణ మాసం సందర్భంగా గురువారం గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకుడు పాపారావు ప్రత్యేక పూజలు చేశారు. వసంతవిహార్‌కి చెందిన జి.మహాలక్ష్మి గాజులు సమకూర్చారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ కేఎల్.సుధారాణి పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ చొరవతో తీరిన వసతి సమస్య

తెర్లాం: మండలంలోని కొరటాం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి కొన్నేళ్లుగా ఉన్న వసతి సమస్య ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ చొరవతో ఎట్టకేలకు తీరింది. అంగన్‌వాడీ భవనాన్ని గురువారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌కు ఎంపీడీఓ అందజేశారు. మండలంలోని గొలుగువలస గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం నిర్మించేందుకు 2018లో ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో అప్పట్లో సంబంధిత కాంట్రాక్టర్ పనులు పూర్తి చేశారు. తాను చేసిన పనికి సంబంధించి బిల్లులు పూర్తి స్థాయిలో చెల్లించలేదని అంగన్‌వాడీ కేంద్రం భవనాన్ని సంబంధిత శాఖకు అప్పగించలేదు. దీంతో చాలాకాలంగా గొలుగువలస అంగన్‌వాడీ కేంద్రం అద్దె భవనంలో కొనసాగుతోంది. ఇదే సమస్యను ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ సీడీపీఓ కె.రాజ్యలక్ష్మి, స్థానిక నాయకులు ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించి ఎంపీడీఓ అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్‌తో మాట్లాడి భవనాన్ని స్వాధీనం చేసుకున్నారు. గొలుగువలస గ్రామానికి వెళ్లి అంగన్‌వాడీ కేంద్రం భవనాన్ని ఐసీడీఎస్ లోచర్ల సెక్టార్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మికి అప్పగించారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్య ఎంపీడీఓ రామకృష్ణ చొరవతో సమస్య పరిష్కారం కావడంతో అంగన్‌వాడీ సూపర్‌వైజర్, కార్యకర్త, స్థానిక నాయకులు ఆనందం వ్యక్తం చేశారు.

కాలువలపై కట్టడాలుంటే తొలగించరా?

- టీడీపీ కౌన్సిలర్లపై వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల ధ్వజం



కౌన్సిల్ సభ్యుల మధ్య వాదులాట

బొబ్బిలి: పట్టణంలోని పెద్దబజారులోని రోడ్డు విస్తరణ పనులు 30 ఏళ్ల తరువాత జరుగుతుంటే కట్టడాలు తొలగించేశారని టీడీపీ నాయకులు మున్సిపల్ సమావేశంలో అడిగి ఫోకస్ చేసుకోవడం ఎందుకని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు చోడిగంజి రమేష్ నాయుడు, ఇంటి గోవిందరావు, ఎస్ రామకృష్ణ అన్నారు. మున్సిపల్ సాధారణ, అత్యవసర సమావేశాలను చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. పదిహేనేళ్ల పాటు టీడీపీ పాలనలో చేయలేని పనులను వైఎస్సార్ సీపీ హయాంలో చేస్తున్నామా.. లేదానన్నది గుర్తించడం మానేసి ఈ కొత్త మాటలెందుకని ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, రాంబార్కి శరత్‌లను ప్రశ్నించారు. అజెండాలో చర్చించిన వాటిని ఎండీపీ అధికారులు, ప్రభుత్వానికి పంపుతున్నారా.. లేదానన్నప్పుడు ఆన్‌లైన్‌లో పంపిస్తామని దానికి రశీదులు ఉండవని మున్సిపల్ ఆర్ఐ పి.సురేష్ బాబు ప్రతిపక్ష కౌన్సిలర్లకు బదులిచ్చారు. వీధిలైట్లు వెలగని ప్రాంతాలు గుర్తించి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు డీఈఈ రవి తదితరులను ఆదేశించారు. ఇందిరమ్మ కాలనీలోని ఆక్రమణలను తొలగించినా మళ్లీ అదే చోట సిబ్బంది సెలవు రోజుల్లో నిర్మాణాలు ప్రారంభిస్తున్నారని, అందుకే రెవెన్యూ అధికారులకు లేఖ రాసి నకిలీ పట్టాల జాబితా పరిశీలించి పూర్తిగా తొలగిస్తామని కమిషనర్ చెప్పారు. మున్సిపల్ ఆదాయానికి గండిపడే ఇబ్బందులు బొబ్బిలిలో లేవని ప్రతిపక్ష సభ్యుల ప్రశ్నలకు కమిషనర్ వివరించారు. మున్సిపాలిటీలో మెప్మా సిబ్బందికి, కౌన్సిలర్లకు డ్వాక్రా రుణాల్లో లంచాలు వసూలు చేసి ఇస్తున్నట్టు డ్వాక్రా సంఘాలను నడిపే వారు ప్రచారం చేయడంపై చర్యలెందుకు తీసుకోవడం లేదని కౌన్సిలర్ ఇంటి గోవిందరావు తదితరులు ప్రశ్నించారు. మల్లంపేటలో శ్మశానాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు తెంటు పార్వతి, కె.రామారావు కోరారు. సచివాలయాల వారీగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.20 లక్షల చొప్పున నిధుల పనులను కౌన్సిల్ ఆమోదించింది.

విద్యా సర్వేను శతశాతం పూర్తి చేయాలి



తెర్లాం-1 సచివాలయంలో సీఆర్ యాప్‌లో విద్యా సర్వేను పరిశీలిస్తున్న ఎంఈఓలు

తెర్లాం: విద్యా సర్వేను గ్రామ వలంటీర్లంతా శతశాతం పూర్తి చేయాలని ఎంఈఓలు త్రినాధరావు, పాపారావు అన్నారు. గ్రామ వలంటీర్లంతా సీఆర్ యాప్‌లో విద్యా సర్వే పూర్తి చేశారా, లేదా తెలుసుకొనేందుకు ఎంఈఓలు గురువారం స్థానిక ఒకటో సచివాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా వారు సచివాలయ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ హరితో మాట్లాడారు. సచివాలయం పరిధిలో ఉన్న గ్రామ వలంటీర్లందరితో సీఆర్ యాప్‌లో ఎడ్యుకేషన్ సర్వేను శతశాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీఆర్ యాప్‌లో ఉన్న విద్యార్థులు ప్రస్తుతం ఎక్కడ ఉన్నారు, ఇంటర్మీడియట్ పూర్తి చేశారా.., లేదా అనే వివరాలను సర్వే చేయాలని సూచించారు. ప్రతీ గ్రామ వలంటీర్ శతశాతం ఎడ్యుకేషన్ సర్వే పూర్తి చేయాలని, ఈ సర్వేపై గ్రామ వలంటీర్లు నిర్లక్ష్యం వహించవద్దని ఎంఈఓలు కోరారు.

గురువుల బోధనలు ఆచరణీయం



బాలకృష్ణదాసుని సత్కరిస్తున్న సత్యనారాయణ నాయుడు, తదితరులు

రేగిడి: సద్గురు బోధనలు ఆచరణీయమని మందసకు చెందిన బాలకృష్ణదాసు అన్నారు. గురువారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా రేగిడి దత్తపీఠంలో ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యనారాయణనాయుడు ఆధ్వర్యంలో దత్త జ్ఞానబోధ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణదాసు మాట్లాడుతూ, భారతీయ సనాతన ధర్మం, సోదరసోదరీమణుల బంధంలు భారతీయ సాంస్కృతిక వైభవంలు అన్నారు. ఆచార సంప్రదాయాలు, భార్యాభర్తల అన్యోన్యజీవనం ఆదర్శంగా ఉండేలా ప్రతిఒక్కరూ అనుభవించాలని తెలిపారు. వారసత్వ పరంపరలను కొనసాగించాలని, పాతివ్రత్య ధదర్మాన్ని, ఏకపత్నీవ్రతుడై ఉండాలని సూచించారు. గురువులను ఆశ్రయించడం ద్వారా మంచి జ్ఞానం అలవడుతుందని తెలిపారు. అనంతరం దత్త పాదుకాపూజ, గణపతిహోమం, ఆధ్యాత్మిక వక్తలకు సత్కారాలు, నారాయణసేవ నిర్వహించారు. కార్యక్రమంలో దత్తపీఠం కన్వీనర్ రుంకు శ్రీనివాసరావు, జడ్డు జగ్గారావు, జడ్డు అప్పలరాం, సామంతుల దామోదరరావు, యర్రాపాత్రుని భాస్కరరావు, బుడుతుల మురళి, భక్తులు పాల్గొన్నారు.

ప్రయోగశాలల నిర్వహణపై ప్రత్యేక దృష్టి



పిరిడిలో సైన్స్ కిట్లు పంపిణీ చేస్తున్న డిప్యూటీ ఈఓ

బొబ్బిలి:

పాఠశాలల్లోని ప్రయోగశాలల నిర్వహణ, విద్యార్థులకు విశదీకరణ వంటి అంశాల్లో ఉపాధ్యాయులు, హెచ్ఎంలు దృష్టి సారించాలని డిప్యూటీ డీఈఓ సీహెచ్ బ్రహ్మాజీరావు అన్నారు. మండలంలోని పిరిడి జడ్పీ ఉన్నత పాఠశాలలో బొబ్బిలి, రామభద్రపురం మండలాల సబ్జెక్టు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సమావేశాన్ని పరిశీలించేందుకు వచ్చిన డిప్యూటీ ఈఓ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ఈ సమావేశాలు ఉపయోగపడేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా సైన్స్ కిట్‌లు పంపిణీ చేసి, ఉపాధ్యాయులకు కొన్ని సూచనలు చేశారు. రిసోర్స్‌పర్సన్‌లుగా శంబంగి శ్రీనివాసరావు, కర్రి సత్యనారాయణ వ్యవహరించారు.

నారశింహునిపేటలో...

మండలంలోని నారశింహునిపేటలో ఇంగ్లిష్ సబ్జెక్టుపై కాంప్లెక్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరు పట్టీని పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను తనిఖీ చేశారు. పాఠశాలలోని సిబ్బందికి పలు సూచనలు చేశారు. కాంప్లెక్స్ చైర్మన్ ఎస్.రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి



సచివాలయంలో సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ కృష్ణారావు

రాజాం సిటీ: మున్సిపాల్టీలోని అన్ని సచివాలయాల సిబ్బంది సమయపాలన పాటించాలని కమిషనర్ డీటీవీ కృష్ణారావు అన్నారు. పొనుగుటివలస సచివాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ సచివాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజల అర్జీలతో పాటు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. ఈయనతో పాటు ఆర్ఐ చక్రవర్తి ఉన్నారు.

ప్రేమానురాగాలకు సూచిక 'రాఖీ'



రాజాం : ఎమ్మెల్యే జోగులకు రాఖీ కడుతున్న వైస్ ఎంపీపీ వర్షిణి



రామభద్రపురం: ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావుకు రాఖీ కడుతున్న జెడ్పీటీసీ సరస్వతి తదితరులు

అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముల మధ్య ప్రేమానురాగాలకు సూచకంగా ఈ పండుగ జరుపుకుంటారు. తన అన్న, తమ్ముడు విజయాలు సాధించడంతో పాటు ఉన్నత శిఖరాలు అధిరోహించాలనే ఉద్దేశంతో అక్కాచెల్లెళ్లు రాఖీలు కట్టి, వారి ఆశీర్వాదం తీసుకుంటారు. రాజాం/బొబ్బిలి నియోజవర్గాలో ఉత్సాహభరిత వాతావరణంలో గురువారం రాఖీ పండుగ జరుపుకున్నారు.

– రాజాం నెట్‌వర్క్



వంగర: కొప్పరలో రక్షాబంధన్ వేడుకలు



సంతకవిటి: మండల కేంద్రంలో తమ్ముడికి రాఖీ కట్టి ఆశీర్వదిస్తున్న అక్క



రేగిడి : వన్నలిలో రాఖీలు కడుతున్న చిన్నారులు

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
బొబ్బిలి / రాజాం
9951602891, 9010133309
Office mail : vzmadvt@gmail.com